క్లుప్తంగా

స్వామివారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కొడంగల్: కొడంగల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పాలు, పెరుగు, నెయ్యి, పసుపు, గంధం వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం అర్చనలు జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సార్ కోసం.. దైవ దర్శనానికి



వీరప్ప

బొంరాస్‌పేట: 'సార్(రేవంత్‌రెడ్డి) కొడంగల్‌లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, మాఊళ్లో నేను వార్డు సభ్యుడను. తర్వాత ఓడిపోయాక చాలా బాధ పడ్డాను. ఇప్పుడు గెలిచి సీఎం అయితే అయోధ్యకు వస్తానని స్వామి వారిని మొక్కుకున్నా. మొక్కు నెరవేరింది. అందుకే ఈ నెల 22న అయోధ్య, కాశీకి వెళ్లి స్వామి వారిని దర్శనం చేసుకుంటా' అని రేగడిమైలారానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు తారాపురం వీరప్ప అన్నారు. అయోధ్య శ్రీరామ మందిరం, ప్రముఖ పుణ్య స్థలం కాశీ దర్శనం అనంతరం సీఎం సార్‌ను కలుసుకుంటానని ఆశాభావం వ్యక్తంచేశారు. శుక్రవారం బయలుదేరి వారం రోజుల్లో తిరిగి వస్తానని చెప్పారు.

ఆర్థిక సహాయం

దోమ: మండల పరిధి బొంపల్లి గ్రామానికి చెందిన అప్పగాళ్ల అడివయ్య సోమవారం చనిపోయారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు అంత్యక్రియల నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, వార్డు సభ్యుడు చంద్రశేఖర్, ఇరు పార్టీల నేతలు రాములు, రమేశ్, మహేశ్, కలీంఖాన్, ముబెర్, ఇంత్యాజ్‌ఖాన్, బషీర్, అశోక్, హైమద్, రామన్నమాదిగ, శ్రీనివాస్, నర్సింహులు, రాజు, కుమార్, అనిల్, వెంకటయ్య, రమేశ్, జంగయ్య, మహేశ్ లక్కి తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: హన్మ్యానాయక్ తండా హీర్యానాయక్ తండా అనుబంధ గ్రామానికి చెందిన భీమ్లానాయక్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న అఖిల భారత బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్ నాయక్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఎన్నికలపై దృష్టి సారించండి

పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులు దృష్టి సారించాలని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, ఆల్ ఇండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని రాసుమల్లగూడ, నాగులపల్లి, ఎలికట్ట, పీర్లగూడ, చౌలపల్లి, కిషన్‌నగర్, హాజిపల్లి, చింతగూడ, నేరేళ్ల చెరువు, బూర్గుల, కమ్మదనం, చిల్కమర్రి గ్రామాల్లో విష్ణువర్ధన్‌రెడ్డి పర్యటించి కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉండాలని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను ప్రజలు ఎంతో ఆదరించారని తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, లష్కర్ నాయక్, శివ, శ్యాంసుందర్‌రెడ్డి, లింగం, ఇస్నాతి గంగాధర్, సతీశ్ పాల్గొన్నారు.

యాదాద్రిలో రజక సంఘం భవన నిర్మాణం

షాద్‌నగర్ రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత పొందవచ్చని యాదాద్రి రజక సంఘం సొసైటీ ఉపాధ్యక్షుడు మహేందర్ అన్నారు. సోమవారం స్థానిక రజక సంఘం కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. యాదాద్రిలో నూతనంగా నిర్మిస్తున్న రజక సంఘం భవన నిర్మాణం కోసం సంఘం సీనియర్ నాయకుడు రాంచందర్ రూ.లక్ష 116 విరాళాన్ని అందజేశారని తెలిపారు. తమవంతు సహకారం అందించేందుకు సంఘం నాయకులు స్వచ్ఛందంగా ముందుకు రావడం హర్షణీయమన్నారు.

'గృహలక్ష్మి' అమలుపై అయోమయం

- ఆందోళనలో ఆశావహులు
- కలగా మారిన పేదోడి సొంతింటి కల
- ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు



దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

దౌల్తాబాద్: నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తెచ్చింది. ఈ పథకం కింద సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించింది. దీంతో మండల పరిధిలో 7,553 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. జిల్లాలో మంత్రి ఆమోదంతో లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉండగా ఆలస్యమైంది. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో పథకం.. అర్జీలకే పరిమితమైంది. రాష్ట్రంలో కొత్త సర్కారు కొలువుదీరడంతో గత ప్రభుత్వం అమలుచేస్తామని హామీ ఇచ్చి, విడుదల చేసిన జీఓలు అమలు అవుతాయో లేదోననే అయోమయం ఆశావహుల్లో నెలకొంది.

సాయం పెంపుపై సందేహం

ఇల్లు లేని వారికి స్థలంతో పాటు రూ.5లక్షలు ఇస్తామని ఆరు గ్యారంటీల్లో ఒకటిగా ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో గృహలక్ష్మిపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీంతో ఆశావహుల్లో నిరాశ మొదలైంది. ఇంటి స్థలం ఉన్న వారిని కూడా అర్హులుగా గుర్తించి, నేరుగా రూ.5లక్షలు మంజూరు చేస్తే ఇందిరమ్మ ఇంటి కల సాకారం అమలవుతుందని ఆశిస్తున్నారు. గ్యారంటీ స్కీముల్లో ఇప్పటికే ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలోని ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. మిగతా వాటి అమలుకు 100 రోజుల గడువు ప్రకటించింది. ఈ నేపథ్యంలో అప్పటి వరకు గృహలక్ష్మి పథకంపై స్పష్టత వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే సాయం పెంపుపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నా.. మళ్లీ ప్రక్రియ మొదలు పెట్టి పూర్తయ్యే సరికి ఎంతకాలం పడుతుందోననే సందేహం మొదలైంది.

ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం



బీర్ల ఐలయ్యను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

పూడూరు: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కురుమ సంఘం మండల నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అన్ని రంగాల్లో రాణించాలంటే మనకు నాయకుడు అవసరమని పేర్కొన్నారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గోవర్ధన్, మల్లేశ్, హరీశ్వర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేశ్, రమేష్, యాదయ్య, గోపాల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టీఆర్ఆర్‌కు..



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న హిందీ ప్రచార సభ సభ్యులు

పరిగి: హిందీ భాష ఎంతో గొప్పదని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హిందీ పండితుల సమస్యలను పరిష్కరించాలని ప్రచార సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే హిందీని జాతీయ భాషగా పరిగణించిందని పేర్కొన్నారు. తెలంగాణలో హిందీ భాషకు తగిన గుర్తింపు ఉందని, తెలుగుతో పాటు హిందీని గుర్తించారని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రచార సభ జిల్లా అధ్యక్షుడు గాంధీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ

పాల్గొన్న ప్రజాప్రతినిధులు



పడిపూజలో పాల్గొన్న సభాపతి ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు

కుల్కచర్ల: అయ్యప్ప శరణుఘోషలతో కుల్కచర్ల గ్రామం మార్మోగింది. సోమవారం మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిలు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని, రాష్ట ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయ్యేలా చూస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, పీఏసీఎస్ చైర్మన్ నాగరాజు, సర్పంచ్ సౌమ్యారెడ్డి, ఎంపీటీసీ ఆనందం, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాంలాల్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, పార్టీ చౌడాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య గౌడ్, రైతుబంధు మండల కమిటీ మాజీ అధ్యక్షుడు రాజు, కనకం మొగులయ్య, మాలె కృష్ణయ్య, అయప్పసేవా సమితి అధ్యక్షుడు పట్లోళ్ల వెంకట్రామిరెడ్డి, అయ్యప్ప భక్తులు ఈశ్వరయ్య, సతీష్‌కుమార్, బండని అంజి, శివకుమార్, శ్రీనివాస్, చందు, బాలయ్య, సంగప్ప, ప్రేం కుమార్, గణేశ్, కేశవులు, రాములు, పోచయ్య, శ్రీశైలం, విశ్వేంద్రచారీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావంతో మెలగాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

శంకర్‌పల్లి: ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలిగి సన్మార్గంలో పయనించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. సోమవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపురంలోని జేఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో కౌన్సిలర్ జూలకంటి లక్ష్మమ్మ ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో బుల్కాపురం మార్మోగింది. పూజలో యాదయ్య పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శశిధర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ శ్వేత, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్‌ఖన్నా, యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, నాయకులు ప్రవీణ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, జూలకంటి వేణు, బాలకృష్ణ పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

మొయినాబాద్ రూరల్: అయ్యప్ప నామస్మరణతో కనకమామిడి గ్రామం మార్మోగింది. గ్రామంలోని అయ్యప్ప ఆలయ పంచమ వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజు అయ్యప్ప స్వామిని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు, భక్తులు, పండితులు కోలాటమాడారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఇందులో అయ్యప్ప స్వాములు సుదర్శన్‌రెడ్డి, మర్రి రాంరెడ్డి, నాగమల్లారెడ్డి, రాంరెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, ఎస్.వెంకట్‌రెడ్డి, జంగం రవి, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

షాద్‌నగర్ రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని లక్ష్మీనర్సింహ కాలనీలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో మున్సిపల్ కౌన్సిలర్ శ్రీనివాస్ అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నరేందర్ పాల్గొని.. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అయ్యప్ప మాల ధరించి, పూజలు చేయడంతో ఎంతో పుణ్యం వస్తుందని అన్నారు.

అర్హులకు ఓటుహక్కు కల్పించాలి

బీఎల్ఓలకు తహసీల్దార్ గణేశ్ ఆదేశం



బీఎల్ఓల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గణేశ్

మర్పల్లి: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ గణేశ్ బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులకు ఓటు హక్కు కల్పించేందుకు బీఎల్ఓలు తగిన శ్రద్ధ చూపాలని, ఓటరు జాబితలో ఎలాంటి తప్పులకు ఆస్కారం ఉండకూడదని చెప్పారు. ముఖ్యంగా ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో స్థిరపడినవారు ఓటు హక్కు ఎక్కడ వినియోగించుకుంటున్నారే సమాచారం సేకరించాలని, లేదా ఫారం 7 ప్రకారం ఓటరు వివరణతో పాటు సంతకం తీసుకొని, జాబితాలో ఉండే విధంగా చూడాలని వివరించారు. ఒక వ్యక్తి రెండు ప్రాంతాల్లో ఓటు కలిగి ఉంటే సంబంధిత బూత్ లెవల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమకు లేదా ఆర్ఐ దృష్టికి తీసుకు వెళ్లాలని సూచించారు. ఎవరైనా మృతి చెందితే వెంటనే జాబితా నుంచి వారి పేరును తొలగించాలని, పార్లమెంట్ ఎన్నికల సమయం లోపు లిస్టులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. ఆర్ఐలు మాధవరెడ్డి, రమేష్, బూత్ లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రాచన్న తదితరులు

మర్పల్లి: సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఐనెల్లి రాచన్న మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రెండుసార్లు పోటీ చేసి, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారని, మూడోసారి ఎమ్మెల్యే గెలుపొంది అసెంబ్లీ స్పీకర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని చెప్పారు. మరిన్ని ఉన్నత పదవులు ప్రాంత అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఆదర్శరైతు రాములు, యాదవ సంఘం మండల అధక్షుడు మల్లేశ్‌యాదవ్, సుదాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'తొలిమెట్టు'తో విద్యా ప్రమాణాలు మెరుగు

- ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలి
- ఎంఈఓ చంద్రప్ప



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రప్ప, స్టేట్ టీం సభ్యుడు సునందం

బంట్వారం: తొలిమెట్టుతో విద్యా ప్రమాణాలు మెరుగు పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. సోమవారం ఆయన ఎఫ్ఎల్ఎన్ స్టేట్ టీం సభ్యుడు సునందంతో కలిసి బంట్వారం, కోట్‌పల్లి మండలాల పరిధి పలు పాఠశాలలను సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎఫ్ఎల్ఎన్‌తో విద్యార్థులు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉండదని తెలిపారు. పాఠశాలల పని దినాలకు అనుగణంగా పాఠ్యాంశాలను విభజించి, బోధనా ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఉపాధ్యాయుల బోధనతో పాటు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసేలా అభ్యాసం కల్పించాలని తెలిపారు. తొలిమెట్టును విజయవంతం చేస్తే ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని, ఇందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే శాఖా పరమైన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నర్సింహులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



కొత్తూరు: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు, నాయకులు

- షాద్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- అందరికీ అందుబాటులో ఉంటా
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులకు రాజకీయాలకు అతీతంగా ప్రజలు, నాయకులు సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. సోమవారం ఆయన మండలంలోని పెంజర్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్ వసుంధరమ్మను గ్రామస్తులు సన్మానించారు. తన గెలుపు కోసం కృషి చేసిన సర్పంచ్‌తో పాటు గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. షాద్‌నగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. స్థానిక పరిశ్రమల్లో యువతకు విద్యార్హతను బట్టి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, గిరిజన తండాల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు పథకానికి అపూర్వ స్పందన వస్తోందని తెలిపారు. సర్పంచ్ వసుంధరమ్మ, నాయకులు రమేశ్, సిద్ధార్థరెడ్డి, అంజమ్మ, జగన్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

సేవకుడిగా ఉంటా..

శంకర్ ఎమ్మెల్యేగా గెలవడంతో కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌కు చెందిన సుమారు 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు మొక్కులు తీర్చుకునేందుకు కాలినడకన తిరుమలకు బయలుదేరారు. తనపై అభిమానంతో పాదయాత్ర చేస్తున్న నాయకులను ఎమ్మెల్యే అభినందించారు. తనను ఆదరించి గెలిపించిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు నాయకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానని, నిరంతరం అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వస్పుల మహేందర్, పాశం కృష్ణ, హరినాథ్‌రెడ్డి, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, జనార్దన్‌రెడ్డి, మల్లిక్, బాలు, శ్రీనివాస్, దయానంద్‌రెడ్డి, చిల్కమర్రి నర్సింలు, చైతన్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని విద్యాశాఖాధికారులకు ఎమ్మెల్యే శంకర్ సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖపై ఎంఈఓలతో మండలాల వారీగా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వెంకట మాధవరావు, తహసీల్దార్ పార్థసారథి, ఎంఈఓ శంకర్, నాయకులు బాబర్‌ఖాన్, రఘు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కుటుంబాలను ఆదుకోండి

పీఆర్‌టీయూ వినతి



సాయం అందజేస్తున్న సంఘం నాయకులు

చేవెళ్ల: ఆపదలో ఉన్న ఉపాధ్యాయ కుటుంబాలను ఆదుకునేందుకు ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి కోరారు. అల్లవాడ గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు అనంత్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. సోమవారం గ్రామంలో కుటుంబసభ్యులు దశదిన కర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి పీఆర్టీయూ సంఘం సభ్యులు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

అల్పాహార పథకం ఏమైంది?

- నర్సరీల నిర్వహణ డబ్బులు ఏవి?
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ప్రశ్నల వర్షం
- మామిడి తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి
- పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

ధారూరు: ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించారు. పులి సంచరిస్తుందని, చేసిన పనులకు బిల్లులు లేవని, లూజ్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల షిఫ్టింగ్, మరమ్మతు పనులు చేపట్టడం లేదని, విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ పథకం ఏమైందనే తదితర వాటిపై సభ్యులు సంబంధిత అధికారులను ప్రశ్నించగా.. వారు స్పందించి వివరాలు ఇచ్చారు. సోమవారం ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది.

ఏజెన్సీ ద్వారా ఫుడ్ సరఫరా

పాఠశాలలో అల్పాహార పథకం ఏమైందని పలువురు సభ్యులు ప్రశ్నించగా.. మండల విద్యాధికారి బాబూసింగ్ స్పందించి వివరణ ఇచ్చారు. పాఠశాలలో పది మంది ఉన్నా.. రెండు వందల మంది ఉన్నా.. రెమ్యునరేషన్ రూ.2వేలు మాత్రమే వస్తుందని, దీనిపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో, మరో ఫుడ్ ఏజెన్సీ ద్వారా బ్రేక్‌ఫాస్ట్ సరఫరా చేయిస్తున్నామని ఆయన వెల్లడించారు. నర్సరీల పెంపకంపై పనిచేసిన కూలీలకు డబ్బులు రావట్లేదని కొందరు సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. ఒక్కో జీపీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున మంజూరు అయ్యాయని, ధారూరు, అంపల్లి జీపీల్లో భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేవని పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్ సభ్యులకు వివరించారు. మామిడి తోటల పెంపకానికి తోడ్పాటు అందించాలని, సబ్సిడీ డబ్బులు ఇప్పిస్తామని నా వద్ద 3 ఎకరాలకు రూ.6 వేలు తీసుకున్నారని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి ఆర్టీకల్చర్ అధికారికి తెలపగా.. డబ్బుల విషయం మాకు తెలియదని, ప్రైవేటుగా వచ్చిన వారికి ఇస్తే మాకే సంబంధం లేదని సంబంధిత అధికారి పేర్కొన్నారు.

పులికాదు.. హైనా

ధారూరు అడవిలోకి పులి వచ్చిందనే వదంతులు వచ్చాయని, అది పులి కాదని, హైనా అని డిప్యూటీ ఫారెస్టు రేంజర్ సగన్‌మోహన్ తెలిపారు. నాగారం, మోమిన్‌కలాన్ సబ్‌స్టేషన్ల పరిధిలో 33 కేవీ లైన్ల కోసం ప్రతిపాదనలు పంపామని ఏఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ శాఖపై ఏదైనా ఫిర్యాదు చేయాలంటే ముందుగా కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సభ్యులకు సూచించారు. గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు ఎందుకు ప్రారంభం కాలేవని సభ్యులు ప్రశ్నించారు. సర్పంచులు చేయించిన పనులకు బిల్లులు రాలేవని, ఎప్పుడు వస్తాయో చెప్పగలరా అని సభ్యులు సంబంధిత ఏఈని కోరారు. కేరెళ్లి నుంచి బుగ్గా రోడ్డు, కేరెళ్లి గ్రామంలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుపై ఆర్ అండ్ బీ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌లు ఆరోపించారు. ఇదిలా ఉండగా.. సమావేశానికి పలు శాఖల అధికారుల గైర్హాజరు కావడం, వారి స్థానంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు కూర్చోవడంతో సమావేశం నిండుగా కన్పించింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీ విజయ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు బసప్ప, వివిధ శాఖల అధికారులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచండి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్: ఆర్టీసీ బస్సులు గ్రామానికి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, బస్సు సర్వీసులు పెంచాలని మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామస్తులు మెహదీపట్నం డిపో మేనేజర్ కృష్ణమూర్తికి సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంజీవరెడ్డి, మల్లేశ్ గ్రామస్తులతో కలిసి డిపో మేనేజర్‌ను కలిశారు. గ్రామానికి ఆర్టీసీ బస్సులు సరిగా రాకపోవడంతో విద్యార్థులు, రైతులు, ప్రైవేటు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సు సర్వీసులను పెంచాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన మేనేజర్ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారు.